# "తుపాను బాధితుల సహాయార్థము?"

రచయిత: చీమలపాటి సూర్యనారాయణ

●

[ గమనిక :—'ప్రభుత్వము' పట్ల—గవర్నమెంటు ఉద్యోగులకుండే—'భక్తివిశ్వాసము'ల ప్రకటన. వ్యక్తిగతముగా గాకుండా, వూహించి వ్రాసిన కథ; ఇందలి భావములకు నేను బాధ్యుణ్ణి. ]

"తుపాను బాధితుల సహాయార్థము" ఆ వూరినుండి సుమారు ఆరేడు వేల రూపాయిలు వసూలుచేసి, (నాటకరూపేణ) ప్రభుత్వమున కంపవలసిందని వారొక యుత్తర్వును జారీచేయటంవలన, అనివార్యముగా తనమీద బడిన యీ భారమునకు ఆదిలో యెంతైనా, పరమ బద్ధ కస్తుడైన తాసిల్దారు చిరాకుబడ్డాడు.

ఏపనియున్నా లేకపోయినా, 24 గంటలు గుమస్తాలను మహాశ్రమబెడతాడు. అందులో యెక్కువగా శ్రమ బెట్టే గుమస్తాలలో నేనో అభాగ్యుణ్ణి. బంట్రౌతు లున్నప్పటికీ ఆఫీసుపనులు తన స్వంతపనులు మాచేతే జేయిస్తాడు.

తాసిల్దారు చెప్పినపనులు చేయకపోతే ఉద్యోగములో నుంచి వూడపీకుతాడేమో అన్న వొక భయం. మరో ఉద్యోగము యిప్పట్లో యెక్కడా లేదు. మేము సరిగా పనులు చేయకపోతే, తిట్టడం కొట్టడం వొక్కొక్కప్పుడు పూర్తిగా జీతాలు ముట్టినట్లు మాచేత సంతకాలు పెట్టించటం; తనకు తోచినంత తెగకోసి, ఆ డబ్బును తన స్వంతఖర్చులకు వినియోగించుకోవటము కద్దు!!

ఆతనికి లంచములిస్తే యేమీ అనడు. నాకిచ్చేందుకు శక్తిలేకపోవటముచేత యెక్కువగా అతనితిట్లకు, దెబ్బలకు: శిరస్సు, దేహము వొగ్గి పైవన్నీ దేహమునకే గాని, ఆత్మకు కావన్న వైరాగ్యమును నేను అనివార్యముగా నెమరు వేయక తప్పింది గాదు. 'చిత్రగుప్త' ద్వారా 'గుసగుస' ల రూపేణ మా తాసిల్దారుగురించి ప్రభుత్వమునకు తెలియ జేసుగున్నా, వారెటువంటి చర్యను తీసుకొనలేదు. యింతకీ అవి నా దుర్దినాలు! దురదృష్టాలు!!

మా గుమాస్తాలందర్నీ, తాసిల్దారుగారు, యింటికి రావలసిందని, బంట్రౌతుద్వారా కబురుపంపారు. వినయముగా చేతులుకట్టుకుని ఆత్రముగా అతను చెప్పబోవువిషయమును వినేందుకు కుతూహలపడుతున్నాము.

సాధారణముగ అతను మమ్మల్ని యింటికి పిల్వడం మేమేదయినా తప్పుజేస్తే శిక్షించేందుకని నాకు గట్టిగా తెల్సు!! నాకు జ్ఞాపకమున్నంతవరకు మే మెటువంటి తప్పు జేయలేదు; ఏమో? లోగుట్టు భజరంగబ...కి దెలియాలి!!

"తుపానుబాధితుల సహాయార్థము" యీ వూరిలో ఓ నాటకప్రదర్శనము గావించి, దాని డబ్బు ప్రభుత్వాని కంపమని వారి యుత్తర్వు. ఎల్లుండి నాటకం; రేపు ఆక్టర్లు వస్తారు.

'మీరివాళ యేంజేస్తారంటే ఈ టిక్కట్లు పుచ్చుకుని, ప్రతీ కొట్టుకుపోయి, బలవంతంగా అంటగట్టండి; ఎవరైనా నిరాకరిస్తే, గవర్నమెంటాజ్ఞని చెప్పండి'

అని తాసిల్దారు చెప్పగానే, అదివరకు మా హృదయ కందరములలో నిహితమైయున్న భయము సడలిపోయింది. మాచేత గూడా బలవంతముగా రు 20 లు విలువ గల టిక్కట్లు కొనిపించాడు. ఎవరూ కిక్కురుమనలేదు. అందరి చేత బలవంతంగా కొనిపించాడు గానీ, తాను, తదితర పెద్ద యుద్యోగస్థులు కొనలేదంటే కాలమహిమంటారా?

అతను చెప్పినట్లు బలవంతంగ టిక్కట్లు అంటగట్టాము. ఆ మర్నాడు యాక్టర్లు వచ్చారు. వారిలో ముగ్గురాడపిల్లలున్నారు. ఎలా నటిస్తారో తెలియదు కాని, ఖచ్చితంగా వున్నారు. వాళ్ళని జూస్తే, ఐను అవని మానవశరీరము లేదంటే సొల్లు కబురనుకునేరు?

వారి ముగ్గుర్లో యిద్దరే నటించుతారని, మూడవ మనిషి వంటపుట్టని, మరో కుర్రాడు ఆడదాని వేషమువేసి, చక్కగా నటిస్తాడని క్రమేపి వివరములు దెల్సుకున్నాను!

రాత్రి 9-30 గంటలైంది. అనుకున్న డబ్బువచ్చింది. బుకింగు మూసివేయబడింది. ఫిమేలు మెయిన్‌గేటువద్ద నిలబడమన్నాడు. టిక్కట్లుకొన్నవారిలో సగముపైగా రావటములేదు; మిగిలిన హాలంతా బావురుమంటూంది. తాసిల్దారు నాదగ్గరకొచ్చి—

"ఇదిగో సూర్యనారాయణ! గేటుదగ్గర డబ్బుపుచ్చుకుని, మనుష్యులను వొదిలిపెట్టు, వచ్చినవారిని లోపట సర్దుతూయుంటాను. ఒక్కదమ్మిడి ఖర్చుచేయకుండా తరువాత నాకిచ్చేయ్ తెల్సిందా? యీ రహస్యమును రహస్య

ముగా ఉంచాలి లేకపోతే నీ యుద్యోగమునకే భంగము" అంటూ, లోపలకు పురోగమించాడు — అతను చెప్పినట్లు గేటుదగ్గర కలక్షనుజేస్తే రు 150 లు వచ్చాయ్. డబ్బంతా అతనికి అప్పజెప్పేసాను. నా ట కం ప్రారంభమయింది. అందులో " రాధ " పాత్రదారి—వేషధారణ—గానకళా నైపుణ్యము — నటనాచాతుర్యము జూచి తాసిల్దారు నీరై పోయాడు.

కొంతకాలము తరువాత,స్టేజిలోనికిపోయి, మేనేజర్ను బయటకు పిలుచుకువచ్చాడు. ఆడవాళ్ళ గేటుదగ్గరున్న సాలలో వాళ్ళు మాట్లాడుతున్నారు. రహస్యముగా తడిక చాటునుండి వింటున్నాను :

"ఆపిల్ల చాల బాగా నటిస్తూంది. ఆమెమీదకు నా మనసు పోయింది. ఎలాగైనా యీరాత్రికామెను నాదగ్గరకు వచ్చే యేర్పాటు జేయగలరా?" అని అధికారం ఉట్టిపడు తూన్న గొంతుతో ప్రశ్నించాడు.

"క్షమించాలి; వాళ్ళు నామాట వినేరకము గాదు; వినినట్లయితే—మీదాకా రానిచ్చేవారము గాము. మీరు స్వయముగా పోయి మాట్లాడుకుంటే వినవచ్చునేమో! వారిలో మీకోర్కె కనుగుణముగా ప్రవర్తించేవారు గూడా యుండొచ్చు"

అని జెప్పి, సెలవుదీసుకుని నిష్క్రమించాడు. నాటకము ఐపోయింది. కొందరాక్టర్లు వేషాలిప్పుకుని హాలుకెదురుగాయున్న బసకుపోయారు. మరికొందరు వేషములతో పోయారు. తాసిల్దారు క్రమంగా వారిబసను చేరుకున్నాడు.

'రాధ' పాత్రధారి తనగదిలో అద్దంముందర నిల్చుని వేషము విప్పుకునేందుకు సిద్ధముగా నుంది. తాసిల్దారు అంతరంగమునుండి తెరలు తెరలుగా నుప్పొంగు ఆశాపూరిత మానసముతో గదిలోకి ప్రవేశించాడు. కవాటము రుద్ధమైపోయింది. నేను వెంటబడి తాళం కన్నంలోనుంచి లోపటి పరిస్థితులను సింహావలోకనం చేస్తున్నాను.

ఆమె తాసిల్దారుగారిని ఆహ్వానించి కుర్చీమీద గూర్చోపెట్టి "మీరాకతో నా గది పవిత్రమైంది!" అంది. ఈమాటతో పాపం యీ అమాయకుడు సముద్రములా పొంగిపోయాడు.

"మీకుగల నటనాచాతుర్యమునకు, గానకళానైపుణ్యమునకు, మీ వేషధారణకు యీచిన్న బహుమానము మీకు తగకపోయినా, నా వేడికోలు మన్నించి, పుచ్చుగుంటారని నా హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అంటూ, జేబులోంచి రు 150 లు తీసి, దాని కర్పించాడు. గేటుదగ్గర ఆడబ్బును వసూలు చేసినంతసేపు పట్టలేదు యివ్వటం!

ఆమె యతని కుర్చీచెయ్యిమీద గూర్చుంది. "మీకు నాపైగల ప్రేమకు నా ధన్యవాదము" లంది నవ్వుతు.

ముసుగులో గుద్దులాటెందుకని కాబోలు "నేను మీ దగ్గర కెందు కొచ్చానో మీకు దెలిసే ఉంటుందనుకుంటాను. నా కోర్కెను మీరు దీర్చక తప్పదు. నేనింత నిర్మొహమాటంగా కోర్కెను బహిర్గతము చేసినందుకు మన్నించండి!" అన్నాడు.

"ఆదిలో మీరాకతోనే గ్రహించాను మీ యుద్దేశ్యమును; సబబుగానే యుంది కాదనలేను. మీ రా కోర్కెను వెలిబుచ్చేముందర మీరు నేనూ వొకటే నని తెల్సుకుంటే నేను ధన్యను!" అంది వ్యంగ్యముగా లేచి నిలబడుతూ.

"తెలుసుకునే నా కోర్కెను వెలిబుచ్చాను. ప్రేమికులకుమాత్రం యేవిషయములోను భేదముండదుగా. సత్యమును వచించారు" అంటూ తాసిల్దారు లేచి యామెను బిగియార కౌగలించుకుని, రంగు అంటుకుంటున్నా ఖాతరు చెయ్యక ముద్దులవర్షము కురిపిస్తున్నాడు.

ఆమె పకపక నవ్వుతూంది.

ప్రేమచే నిమీలితమయిన నేత్రములతో ఉరికే యుద్రేకముతో ఆమె జుత్తు నిమురుతున్నాడు.

ఒక్కమారు బుర్రకు కట్టుకున్న విగ్గు కాస్త యూడి క్రిందపడిపోయింది. అతని తన్మయత్వమంతా పంచబంగాళమైంది. ఆమె మొగాడన్న యధార్థవిషయమును తెలుసుకున్న తాసిల్దారుకు శరీరం వొణుకనారంభించింది. 'ఆమె' పక పక నవ్వుతూంది.

తాసిల్దారు మరక్కడ నిలబడక బయటకు వచ్చేస్తున్నాడు విలుప్తమైన హృదయముతో. అతను బయటకు రాకముందే నేను ధృతగామినై చీకట్లో లీనమైపోయాను.

